


ఏపీఎస్పీ డీఐజీగా రాజకుమారి

మంగళగిరి: ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ కొత్త డీఐజీగా బి.నాగరాజకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఆమెను అభినందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్ కౌన్సెలింగ్, సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ సోమవారం గుంటూరు శివారు నల్లపాడులోని ఎంజీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైంది.

న్యూస్‌రీల్

రీ ఓపెన్ అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



బాపట్ల: జిల్లాలో స్పందన రీ ఓపెన్ అర్జీలను గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువు దాటకుండా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. స్పందన రీ ఓపెన్ అర్జీలు రెవెన్యూ, పంచాయతీ శాఖల్లో ఎక్కువగా ఉన్నాయన్నారు. జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సోమవారం నాటికి అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక్క పంచాయతీ శాఖలో 15 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, డీఆర్‌డీఏ పీడీ అర్జున్, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేష్,గృహ నిర్మాణ శాఖ జేడీ ప్రసాద్, డీఈఓ రామారావు, పౌర సరఫరాల శాఖ డీఎస్‌ఓ విలీమ్స్, డీఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 5న వేద పాఠశాల పునఃప్రారంభం

పట్నంబజారు(గుంటూరు): గుంటూరు మారుతి నగర్‌లోని కంచి కామకోటి పీఠ మారుతీ ఆలయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ష ధర్మ సమితి వేద స్మార్త సంస్కృత శాస్త్ర పాఠశాల జూన్ 5 నుంచి పునఃప్రారంభమవుతుందని ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5 నుంచి అధ్యయన తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేద పాఠశాలలో చేరేందుకు ఉపనయనం పూర్తి అయి ఉండి 8 ఏళ్ల నుంచి 11 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారే అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9848872729 నంబరును సంప్రదించాలని వెల్లడించారు.

ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఉచిత ప్రవేశం

బాపట్ల: వెదుళ్ళపల్లి ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 130 ఖాళీలు భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఐదేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు వయస్సుగల పిల్లలు అర్హులని, కనీసం 40 శాతం వినికిడి లోపం గల వైద్య ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన, కంప్యూటర్ బోధన, ఉచిత భోజన వసతి, సబ్బులు, పేస్టులు, వైద్య సౌకర్యాలు అందిస్తామని వివరించారు. జగనన్న విద్యాకానుక , అమ్మఒడి తదితర అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9949004094, 9493447237, 9000013633 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

15 మందికి ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 మందికి ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ. సూర్యకుమారి శనివారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. జెడ్పీ, మండల పరిషత్ కార్యాలయాల్లో పని చేస్తున్న పరిపాలనాధికారులతోపాటు ఈఓపీఆర్డీలకు తాత్కాలిక విధానంలో ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించిన ప్రభుత్వం వారికి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇచ్చింది. జెడ్పీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ఏవోలుగా పని చేస్తున్న జి.శ్రీనివాసరావు, బి.మహేష్‌బాబు, బి.శ్రీనివాసరావు, బి. మారుతి శేషాంబ, కె.శివపార్వతి, ఎంకే చక్రపాణి ప్రసాద్, కె.శ్రీనివాసరావుతో పాటు ఈవో పీఆర్డీలుగా చేస్తున్న కె. సమతావాణి, కె. ప్రభాకరరావు, ఏవీ రంగనాయకులు, పి. రామకృష్ణ, యూబీ వరప్రసాద్, టి. వీరభద్రాచారి, పి.శివ సుబ్రహ్మణ్యం ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి పొందారు. ఇదిలా ఉంటే బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు జెడ్పీ ఉద్యోగులకు ఈనెల 31 వరకు గడువు ఉంది.

ఫోర్ ద పీపుల్

సంక్షేమ సర్కారు నాలుగేళ్ల ప్రస్థానమిదీ..

- అభివృద్ధి పథంలో ఉమ్మడి గుంటూరు
- పిడుగురాళ్ల, బాపట్లలో మెడికల్ కళాశాలలు
- నిజాంపట్నం, వాడరేవుల్లో ఫిషింగ్ హార్బర్‌లు
- కొత్తగా ఆక్వా యూనివర్సిటీ మంజూరు
- గుంటూరు చానల్ విస్తరణ
- వరికపూడిసెల ఎత్తిపోతలకు లైన్ క్లియర్

ప్రజాకంటకులపై సంచలన విజయంతో నవ్యాంధ్ర సింహాసనంపై సంక్షేమ పతాకను సగర్వంగా రెపరెపలాడించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక పాలనతో జన హృదయాలపై చెరగని ముద్రవేశారు. నవరత్నాలు పొదిగిన ప్రగతి రథాన్ని పరుగులు పెట్టించారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి వ్యాప్తి పీచమణిచి జన జీవితాలకు రక్షగా నిలిచారు. కరవు కాటకాలు రాష్ట్ర దరిదాపుల్లోకి రాకుండా పారదోలారు. సుభిక్ష, సుస్థిర పాలనతో 'ఆదర్శ'ప్రదేశ్‌ను సాక్షాత్కరింపజేశారు. రాష్ట్ర చరిత్రలోనే సువర్ణాధ్యాయాన్ని లిఖించారు. నాలుగేళ్లు ఫర్ ద పీపుల్ అనే పదానికి నిలువెత్తు నిదర్శనమై జయజయధ్వానాలు అందుకున్నారు. కుట్రలు, కుయుక్తులతో ఏకమైన దుష్టచతుష్టయంపై యుద్ధం ప్రకటించి ప్రజలతోనే తన ప్రయాణమని ఎలుగెత్తిచాటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పరిపాలన వికేంద్రీకరణతో నవశకానికి నాంది పలికారు. అభివృద్ధి ఫలాలు అందరి దరిచేర్చి వరాల సిరులు కురిపించారు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధి ముఖచిత్రంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలమైన ముద్రవేశారు. ఫలితంగా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ఉమ్మడి జిల్లా ప్రగతి పథాన దూసుకెళుతోంది. రెండేళ్ల కరోనా సంక్షోభం వెంటాడినా ప్రభుత్వం వెనుకంజ వేయలేదు. అందరికీ తక్షణ వైద్యం అందేలా చర్యలు తీసుకుంది. అంతటి కష్టకాలంలోనూ పేదలు ఎలాంటి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలతో ఆర్థిక ఆసరా కల్పించింది. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన వెంటనే వలంటీరు, గ్రామ సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి ప్రజల ముంగిళ్లలోకే వెళ్లి తలు తట్టి మరీ ప్రగతి, సంక్షేమ ఫలాలను అందించింది. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. మనబడి నాడు-నేడు పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని 1,183 పాఠశాలలను 289 కోట్ల రూపాయలతో ఆధునికీకరించింది. వసతులు కల్పించింది. పరిపాలనా సౌలభ్యం కోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజించి అభివృద్ధికి చర్యలు చేపట్టింది. గుంటూరు నగరాన్ని రూ. 300 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దేందుకు నడుంకట్టింది.

గుంటూరు వైద్య కళాశాలకు మహర్దశ

గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. నాడు-నేడు ద్వారా రూ. 500 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో వైద్య కళాశాల, కళాశాలకు అనుబంధంగా ఉన్న గుంటూరు జీజీహెచ్, ఛాతి సంబంధిత వ్యాధుల ఆస్పత్రి రూపు రేఖలు మారనున్నాయి. ఇటీవల 40 పీజీ సీట్లు వైద్య కళాశాలకు మంజూరయ్యాయి. దీనికోసం కావాల్సిన వైద్య సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ. 40.8 కోట్లు విడుదల చేసింది.

బాపట్లలో రూ.505 కోట్లతో వైద్య కళాశాలను నిర్మించనున్నారు. దీనికి సంబంధించి గత ఏడాది ఏప్రిల్ 27న ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. దీని కోసం 51.07 ఎకరాల్లో జమ్ములపటం, మూలపాలెం సరిహద్దుల్లో భూమిని సేకరించారు. సాయిల్ టెస్ట్‌లూ పూర్తయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అలాగే నాడు-నేడు ద్వారా ప్రాథమిక వైద్యశాలల ఆధునికీకరణకు చర్యలుచేపట్టింది. దీని కోసం రూ.49.24 కోట్లు ఖర్చు చేసింది.



జన హృదయాలు సంబర'పడవ' : అభివృద్ధి కానున్న నిజాంపట్నం హార్బర్

గుంటూరు చానల్ విస్తరణతో 75వేల ఎకరాలకు మేలు

గుంటూరు చానల్ విస్తరణకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ పనులు పూర్తయితే 48 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మల్లాయపాలెం, కాకుమాను మేజర్ల కింద ఉన్న 9, 600 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది. కాలువల సామర్థ్యం పెరుగుతుంది. దీనివల్ల మరో 17,400 ఎకరాలకు సాగునీరు అందుతుంది. మొత్తంగా 75వేల ఎకరాలకు సాగునీటి కష్టాలు తీరతాయి. ఈ పనుల కోసం 274.53 కోట్ల రూపాయలతో పరిపాలనా అనుమతులు వచ్చాయి. ఈ పనులను మెగా ఇంజనీరింగ్ సంస్థకు అప్పగించారు. భూసేకరణ కోసం 113.39 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. దీని కోసం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది.

తీరంలో ప్రగతి తరంగాలు

తీరంలోనూ ప్రగతి తరంగాలు ఎగసి పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాబార్డు సహకారంతో నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌ను రూ.450 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు. వాడరేవులో రూ. 450 కోట్లతో ఫిషింగ్ హార్బర్, నిజాంపట్నంలో 180 కోట్లతో ఆక్వా యూనివర్సిటీకి ఇటీవలే ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

సంక్షేమ సిరులు

నవరత్నాల ద్వారా ఇంటింటా సంక్షేమ సిరులు కు రుస్తున్నాయి. ఇప్పటివరకు 91 లక్షల మంది లబ్ధిదారులకు రూ.30వేల కోట్లమేర ప్రయోజనం చేకూరింది.

విజయీ'భవన్'

ప్రభుత్వ భవనాల నిర్మాణమూ వేగంగా సాగుతోంది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 311 సచివాలయ భవనాలు, 138 రైతు భరోసా కేంద్రాలు, 346 స్కూల్ ప్రహరీ పనులు, 96 వైఎస్సార్ క్లీనిక్‌లు 627 కోట్ల రూపాయల అంచనాతో పూర్తయ్యాయి. 139 బల్క్‌మిల్క్ యూనిట్లు, 165 వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాల నిర్మాణం పురోగతిలో ఉంది.

'ఇంటి'గ్రేట్

పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మూడు లక్షల మంది పేదలకు లబ్ధి చేకూరింది. వీరి కోసం 6,660 ఎకరాల భూమిని సేకరించారు. 1240 కోట్ల రూపాయల ఖర్చుతో అభివృద్ధి చేసి పేదలకు కేటాయించారు. ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. తాజాగా రాజధానిలోనూ 50,793 మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారు.

శరవేగంగా కొత్త వైద్యకళాశాల నిర్మాణం



పిడుగురాళ్ల మండలం కామేపల్లి శివారులో 47.54 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో చేపట్టిన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. డిసెంబర్ 2023 నాటికి పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.. ఈ కళాశాల పూర్తయితే అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. వంద ఎంబీబీఎస్ సీట్లు మంజూరయ్యే ఆస్కారం ఉంది.

వరాల వరికెపూడిసెల



వరికపూడిసెల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.340 కోట్లతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ పథకం నిర్మాణంతో పల్నాటి ప్రాంత వాసుల ఏడు దశాబ్దాల కల తీరనుంది. ఈ పథకానికి కేంద్రం నుంచి అనుమతులూ రాష్ట్ర ప్రభుత్వం సాధించింది. ఈ ఎత్తిపోతల పూర్తయితే 73 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందుతుంది. నూజెండ్ల మండలంలో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.95 కోట్లతో ఐదు ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి సర్వే పూర్తయింది.

సంక్షేమం చూసి ఓర్వలేకే విమర్శలు



బైక్ ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, నాయకులు

- చంద్రబాబు వయోభారంతో ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదు
- అమరావతిలో ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలతో పోల్చటం బాధాకరం
- ఎమ్మెల్యే కోన రఘుపతి
- నాలుగేళ్ల పాలన, అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీపై హర్షం వ్యక్తం చేస్తూ బాపట్లలో బైక్ ర్యాలీ

బాపట్ల: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేక ఒక పక్కన, వయోభారంతో తాను ఏం మాట్లాడుతున్నానో తెలీకుండా మాట్లాడేస్తూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాలం గడపుతున్నాడని, మహానాడులో ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోనే దీనికి నిదర్శనమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలన పూర్తి కావటం, అమరావతిలో నిరుపేదలకు నివేశన స్థలాలు అందించటంతో హర్షం వ్యక్తం చేస్తూ బాపట్ల పట్టణంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ద్విచక్రవాహన ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శన కోన నివాసం నుంచి చీలురోడ్డు, పాత బస్టాండ్, డీఎంపల్లి, అంబేడ్కర్ మార్గ్ మీదుగా కొనసాగింది. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రకటించే మ్యానిఫెస్టోలోని ప్రతి అంశాన్ని అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. 14ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయుడు అనునిత్యం ప్రజలను మోసగిస్తూనే పాలన కొనసాగించారన్నారు. ప్రజలను మభ్యపెట్టే విధంగా ఎన్నికలు సమీపించే తరుణంలో చంద్రబాబునాయుడు బుర్రలో ఏమి వస్తే వాటిని ప్రకటించటం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు.

సచివాలయ వ్యవస్థతో క్షేత్రస్థాయి పాలన...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన రోజు నుంచే క్షేత్రస్థాయిలో పాలన కొనసాగిందన్నారు. కరోనా సమయంలో ప్రజలకు మెరుగైన సేవలు సచివాలయం వ్యవస్థతో సమర్థవంతంగా ఎదుర్కోవటం జరిగిందని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేయలేని చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారం ఇస్తే అవి చేస్తాం..ఇవి చేస్తామంటూ హామీలు గుప్పించటాన్ని ప్రజలు నమ్మరన్నారు.

పేదలకు స్థలాల పంపిణీపై విమర్శలా..?

అమరావతిలో నిరుపేదలైన 50వేల మందికి నివేశన స్థలాలు పంపిణీ చేస్తుంటే చంద్రబాబు నాయుడు సెంటులో శ్మశాన వాటికలు నిర్మించుకోండంటూ చెప్పటంపై కోన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలనే ఆలోచన కూడా లేని చంద్రబాబునాయుడు ఈవిధంగా మాట్లాడటం బాధకరమన్నారు. చంద్రబాబునాయుడుకు ప్రజలే బుద్ధి చెప్పేరోజులు త్వరలోనే ఉన్నాయని కోన పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, మాజీ కౌన్సిలర్ కాగిత యజ్ఞయ్య, నాయకులు చింతల రాజశేఖర్, జోగి రాజా, ఇనగలూరి మాల్యాద్రి, సోముల రాజశేఖర్‌రెడ్డి, ఆట్ల ప్రసాద రెడ్డి, బుల్లిరెడ్డి, గవిని కృష్ణమూర్తి, కన్నా మామిడయ్య, నర్రావుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో అర్హులందరికీ సంక్షేమం



బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- కూచిపూడి లాకు నుంచి చినపరిమి వరకు బైక్ ర్యాలీ

చినపరిమి(వేమూరు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో సోమవారం బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం కూచిపూడి లాకు వద్ద నుంచి చుండూరు మండలం చిన పరిమి గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులాలు, మతాలు, పార్టీలు, ప్రాంతాలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. రూ.2లక్షల 50 వేల కోట్లు రైతులు, మహిళలు, విద్యార్థులకు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 98 శాతం అమలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, చుండూరు గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదె శివరామకృష్ణారెడ్డి, పందిపాటి ఏసు, గ్రామ సర్పంచ్ మేరుగ సుభాషిణి, అవుతు సాయిబాబ రెడ్డి, పాల్గొన్నారు.

జూన్ 2న ముఖ్యమంత్రి గుంటూరు పర్యటన



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, చిత్రంలో జేసీ రాజకుమారి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా గుంటూరులోని చుట్టుగుంటలో జూన్ 2న జరగనున్న వ్యవసాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రానున్నారని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, అధికారులందరూ సమష్టిగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెండో విడతగా 793 ట్రాక్టర్లు, 38 హార్వెస్టర్లు రైతులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణ, ప్రకాశం జిల్లాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని వెల్లడించారు. పారిశుద్ధ్యం, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయాలని తెలిపారు. గత ఏడాది కూడా ఈ కార్యక్రమం నిర్వహించిన నేపథ్యంలో అధికారులు ఆ అనుభవంతో ముందుకెళ్ళాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, అడిషనల్ ఎస్పీ సుప్రజ, డిప్యూటీ కలెక్టర్ లలిత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారానికి కృషి

పల్నాడు జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వస్తున్న అర్జీల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. తొలుత జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీలతో కలిసి జేసీ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు 170 మంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్, డీఆర్వోలకు వినతి పత్రాలను అందజేశారు. స్వీకరించిన వినతులను అధికారులకు అందజేసి పరిష్కారమయ్యేలా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. నరసరావుపేట మండలంలోని ఇక్కుర్రు జగనన్న లేఅవుట్‌లో స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న ఎనిమిది మంది ట్రాన్స్‌జెండర్లకు పట్టాలను అందజేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలదారులకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాత వైవీఆర్ ఫౌండేషన్ వెంకటరత్నం భోజన సదుపాయం కల్పించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు.

543 పాఠశాలల్లో రూ.190 కోట్లతో పనులు

- నాడు-నేడు పనులు జూన్ 12లోపు పూర్తి చేయాలి
- రూ.69.40కోట్లు బిల్లులు చెల్లింపు
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి పనులు జూన్ 12వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. నాడు - నేడు పాఠశాలల అభివృద్ధి పనులపై విద్యాశాఖ, ఇంజనీరింగ్‌శాఖ అధికారులతో సోమవారం స్థానిక స్పందన సమావేశం మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి పాఠశాలలు సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ప్రాధాన్యత అంశాలను పరిగణనలోకి తీసుకొని నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యతను ప్రామాణికంగా తీసుకోవాలని ఆదేశించారు. బాపట్ల జిల్లాలోని 543 పాఠశాలలలో నాడు - నేడు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాకు రూ.190 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం జరిగిన పనులకు రూ.69.40 కోట్లు నిధులను బిల్లుల కింద చెల్లించామన్నారు. నాడు-నేడు పనులకు నిధుల కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. 225 అదనపు తరగతి గదులు, 78 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణాలను తదుపరి దశలో చేపట్టాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం సూచించిన మేరకు ప్రాధాన్యత క్రమంలో 474 పాఠశాలలో 10 రకాల పనులు ముగించాలన్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, బ్లాక్ బోర్డు, వంట గదులు వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ఎంఈఓలు నిరంతరం అప్రమత్తంగా ఉండి పనులను పర్యవేక్షించాలన్నారు.

వేగవంతం చేయాలి..

పాఠశాలల అభివృద్ధి పనులు పురోగతిలో ఉండేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. రేపల్లె, మార్టూరు, కొరిశపాడు, బల్లికురవ, అద్దంకి, బాపట్ల మండలాలలో పనులు కొంత జాప్యం ఉందని పురోగతి సాధనకు కృషి చేయాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లు ఇప్పటికే 90శాతం జిల్లాకు అందాయన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు చేరగానే వాటిని పంపిణీ చేయాలన్నారు. గ్రీన్ బోర్డులు అవసరం లేని పాఠశాలల నుంచి అవసరం ఉన్న పాఠశాలలకు తరలించాలన్నారు. విద్యాశాఖలోని అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ మార్గ నిర్దేశనం చేశారు. జేసీ సీహెచ్ శ్రీధర్, డీఈఓ పీవీ రామారావు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణ, వాతావరణ మార్పులపై శిక్షణ



మాట్లాడుతున్న విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి

బాపట్ల అర్బన్: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికతో విపత్తు ప్రమాద తగ్గింపు, వాతావరణ మార్పుల స్వీకరణ, ఏకీకరణపై శిక్షణ కార్యక్రమం బాపట్లలో విస్తరణ శిక్షణ కేంద్రంలో సోమవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని తీరప్రాంతాలకు చెందిన బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, చీరాల, వేటపాలెం, చిన్నగంజాం మండలాల 50 మంది పంచాయతీరాజ్ సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, మాస్టర్ రిసోర్స్ పర్సన్లకు ఈనెల 29, 30 తేదీల్లో రెండు రోజులు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికతో విపత్తు ప్రమాదాల తగ్గింపు, వాతావరణ మార్పుల స్వీకరణ, ఏకీకరణపై రెసిడెన్షియల్ కార్యక్రమం ప్రారంభించారు. విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విపత్తు ప్రమాదాల తగ్గింపు, వాతావరణ మార్పుల స్వీకరణ, విపత్తు నిర్వహణ, వివిధ దశలలో పంచాయతీరాజ్ సంస్థల పాత్ర, పంచాయతీలతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను స్థానికీకరించడం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, వాతావరణ మార్పుల స్వీకరణ ప్రణాళిక సిద్ధం చేయడం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికతో ఏకీకరణ చేయడం, ఏకీకృతం చేయడం ద్వారా తయారీపై గ్రూపు వర్క్ అంశాలపై శిక్షణ తరగతులు జరుగుతాయని వెల్లడించారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రత్యూష పట్నాయక్, వైస్ ప్రిన్సిపాల్ స్వరూప శోభారాణి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బి.ఎస్.నారాయణ భట్టు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఇశ్రాయేలుకు ఆత్మీయ సత్కారం

కారంచేడు: మండలంలోని కేశవరప్పాడులో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ బొమ్మె ఇశ్రాయేలుకు ఆత్మీయ ఘన సత్కారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు చిరుమల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు స్వర్ణ–దగ్గుబాడు క్రాస్ రోడ్డు భారీ ర్యాలీగా గ్రామంలోకి వస్తారన్నారు. చెరువుకట్ట మీద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మె ఇశ్రాయేలు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావులకు ఆత్మీయ ఘన సత్కారం నిర్వహించే ఏర్పాట్లు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్లస్టర్ భవనాలను ప్రారంభించి ఉపాధి కల్పించాలి



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందిస్తున్న చేనేత ఐక్యవేదిక నాయకులు

బాపట్ల: క్లస్టర్ భవనాలను ప్రారంభించి చేనేతలకు ఉపాధి కల్పించాలని జాతీయ చేనేత ఐక్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతి పత్రం అందించారు. సోమవారం బాపట్లలోని స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందించిన అనంతరం ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అండగుండ నారాయణ మాట్లాడుతూ జీఎస్టీ వలన చేనేతలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. మార్కెట్‌లో రంగులు, రసాయనాల ధరలు పెరిగిపోవటంతో చేనేతలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని వివరించారు. చేనేతలను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఐక్యవేదిక బాపట్ల జిల్లా అధ్యక్షుడు వుట్ల రవీంద్ర, మునగాల గిరిధర్, జిల్లా కార్యదర్శి జంజనం మోహన్‌రావు ఉన్నారు.

ఎన్నికల్లో టీడీపీకి 'సమాధే'

- పేదలకు మేలు జరుగుతుంటే ఓర్వలేరా
- ఇళ్ల స్థలాలను సమాధులతో పోలుస్తారా?
- ప్రజలే చంద్రబాబుకు బుద్ధి చెబుతారు
- రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ధ్వజం
- చంద్రబాబు విద్వేషపూరిత వ్యాఖ్యలకు నిరసగా భారీ బైక్ ర్యాలీ



చిలకలూరిపేటలో జరిగిన భారీ బైక్ ర్యాలీ



ప్రదర్శనలో పాల్గొన్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పేదలకు మేలు జరుగుతుంటే చంద్రబాబు చూసి ఓర్వలేక పోతున్నారని, పేదల పట్ల ఆయనకు ఎందుకు అంత విద్వేషమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. పేదలకు పంపిణీ చేసే ఇళ్ల స్థలాలను చంద్రబాబు నాయుడు సమాధులతో పోల్చడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్ నుంచి, అడ్డరోడ్డు, కళామందిర్ సెంటర్, మీదుగా వైఎస్సార్ సీపీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ సాగింది. భాస్కర్‌సెంటర్లోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి నివాళి అర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పేదలంతా జగనన్న వెంటే ఉన్నారని తెలిసి చంద్రబాబునాయుడు రగిలిపోతున్నారని విమర్శించారు. అవకాశం వచ్చిన ప్రతిసారీ పేదలపై పగతీర్చుకునేందుకు చంద్రబాబు యత్నిస్తూనే ఉన్నారని దుయ్యబట్టారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంచుతూ వారికి జగనన్న ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని వెల్లడించారు. అలాంటి ఇళ్ల స్థలాలను చంద్రబాబు సమాధులతో పోల్చడం అత్యంత దుర్మార్గమని ధ్వజమెత్తారు. సమయం వచ్చినపుడు పేదలే చంద్రబాబుకు బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. పేదల ఇళ్లు అంటే ఆయనకు ఇంత చిన్నచూపా అని ప్రశ్నించారు. చంద్రబాబు వ్యాఖ్యలు ఆయన పెత్తందారీ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీలను నియమించి ఆ కమిటీలతో పేదలపై పెత్తనం చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి పేదల ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలు అందేలా చూస్తున్నారని వివరించారు. పేదలపై పెత్తనం చేసే పార్టీ టీడీపీ అని పేర్కొన్నారు. పేదల కోసం పనిచేసే పార్టీ వైఎస్సార్ సీపీ అని చెప్పారు. ప్రజలందరికీ ఈ విషయం తెలుసునని, ఇప్పుడు చంద్రబాబు నాయుడు మహానాడు పెట్టి.. ఆ సభలో పేదలపై లేని ప్రేమ నటిస్తున్నారని విమర్శించారు. అధికారం ఉన్నప్పుడు ఒకలా.. లేనప్పుడు మరోలా నటించడం ఒక్క చంద్రబాబుకే సాధ్యం అవుతుందని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు పేదల అభ్యున్నతి కోసం ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయని చంద్రబాబు నేడు ఇతర పార్టీల మేనిఫెస్టోలు కాపీ కొట్టి వాటిని అమలు చేస్తాననడం విడ్డూరంగా ఉందని వెల్లడించారు. అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని పేదలు ఇప్పుడు ఎందుకు గుర్తు వచ్చారా అని ప్రశ్నించారు. పేదలను ధనికులను చేస్తానని, సంపద సృష్టిస్తానని గారడీ మాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. పేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్లస్థలాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ తన అనుచరులతో న్యాయస్థానాలను ఆశ్రయించి ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకునేందుకు సర్వశక్తులు ఒడ్డిన చంద్రబాబుకు పేదలే గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

అర్జీలు పునరావృతం అయితే సహించేది లేదు

స్పందనలో ఎస్పీ వకుల్ జిందాల్



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: స్పందన అర్జీలు పునరావృతం అయితే సహించేది లేదని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్‌లు నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ స్పందన అర్జీలు పునరావృతం కాకుండా బాధితులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. స్టేషన్‌లోని ప్రతి ఒక్క సిబ్బంది ఫిర్యాది దారుల సమస్యలను కూలంకషంగా విని, వారి అర్జీలను పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ఫేక్ స్క్రీన్ షాట్లతో టోకరా

బంగారు షాపుల యజమానులను మోసం చేస్తున్న అంతర్ జిల్లా మోసగాడు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ నాయబ్ రసూల్

ఇంకొల్లు (చినగంజాం): బంగారపు షాపు యజమానులను మాయమాటలతో మోసగించి బంగారం దోచుకెళ్తున్న అంతర్‌జిల్లా మోసగాడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. సోమవారం ఇంకొల్లు పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జే.పంగులూరు మండలం జాగర్లమూడివారి పాలెం గ్రామానికి చెందిన ఊదరగుడి అశోక్ బంగారు వస్తువులు కొనుగోలు చేయడానికి వెళ్లి షాపు యజమానులను మోసపూరిత మాటలతో నమ్మిస్తాడు. అనంతరం వారి వద్ద నుంచి వస్తువులను కొనుగోలు చేసి వాటి తాలుకా డబ్బులు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేస్తానని నమ్మించి, డబ్బు పంపినట్లు ఫేక్ స్క్రీన్ షాట్‌ను చూపిస్తాడు. వారితో డబ్బులు మీకు జమ కావడానికి కొంత సమయం పడుతుంది, ముందు నాకు వస్తువులు ఇస్తే నేను ఫంక్షన్‌కు అటెండ్ అవుతానని మాటలతో బురిడీ కొట్టిస్తాడు. షాపులో యజమానులకు తన ఫోన్ నంబర్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, చెక్ ఫొటోలు తీసి వారికి వాట్సాప్ చేస్తాడు. వారితో మీకు డబ్బు రావడానికి లేట్ అయితే మీరు నన్ను కాంటాక్ట్ అవ్వండి అంటూ బంగారపు వస్తువులతో అక్కడి నుంచి ఉడాయిస్తాడు. ఇదేవిధంగా గతనెల 29వ తేదీన ఇంకొల్లు గ్రామంలోని గంగవరం రోడ్డులో ఉన్న ఆకుల భుజంగరావు షాపులో యజమాని ఆకుల మాచేశ్వరరావును మోసం చేసి అతని వద్ద నుంచి మూడు ఉంగరాలను తీసుకువెళ్లాడు. దర్యాప్తులో భాగంగా ఇంకొల్లు ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ అతనిని ఆర్టీసీ బస్టాండు వద్ద శనివారం అదుపులోనికి తీసుకుని అరెస్టు చేశాడు. అతని వద్ద నుంచి రూ.72 విలువ చేసే మూడు బంగారు ఉంగరాలు రికవరీ చేసినట్లు తెలిపారు. వస్తువులను రికవరీ చేసిన ఇంకొల్లు సీఐ, ఎస్ఐ, అతని సిబ్బందిని చీరాల డీఎస్పీ కేఎస్ ప్రసాదరావు, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ వారిని అభినందించారు.

గల్లంతైన బాలుడిని కాపాడిన గజ ఈతగాళ్లు

సిబ్బందికి ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందన



బాలుడ్ని కాపాడిన మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు

బాపట్లటౌన్: సూర్యలంక సముద్రతీరంలో అలల తాకిడికి కొట్టుకుపోతున్న బాలుడిని ప్రాణాలకు తెగించి మెరైన్, రూరల్ పోలీసులు, గజ ఈతగాళ్లు కాపాడారు. సోమవారం సూర్యలంక సముద్ర తీరంలో మెరైన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.పోతురాజు, లోకల్ స్టేషన్ హోంగార్డు ఎస్.శ్రీనివాసరావు, గజ ఈతగాడు మోకా గోపి అందరు కలిసి గస్తీ తిరుగుతుండగా.. కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన జెట్టి మహేష్ అనే బాలుడు సముద్రంలో లోతులో మునుగుతుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయాడు. అది గమనించిన హెడ్ కానిస్టేబుల్ ఎం.పోతురాజు, లోకల్ స్టేషన్ హోంగార్డు ఎస్.శ్రీనివాసరావు, గజ ఈతగాడు మోకా గోపి వెంటనే స్పందించి ప్రాణాలకు తెగించి సముద్రంలోకి వెళ్లి అలల తాకిడికి కొట్టుకుపోతున్న జెట్టి మహేష్‌ని ఒడ్డుకు చేర్చి ప్రథమ చికిత్స చేసి అతడి ప్రాణాలను కాపాడారు. యువకుడి ప్రాణాలు కాపాడిన సిబ్బందిని ఎస్పీ వకుల్‌జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ సముద్ర తీరాలకు విహారానికి వచ్చిన యాత్రికులు పోలీస్ వారి సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సముద్రం ఏ సమయంలో ఏ విధంగా ఉంటుందో సామాన్య ప్రజలకు తెలియదన్నారు. సముద్రం ఆటుపోట్లకు గురి అవుతున్న సమయంలో, అలల తాకిడి ఎక్కువగా ఉన్న సమయంలో, యాత్రికులు సముద్రంలో ముందుకు వెళ్లకూడదన్నారు. పోలీస్ వారి హెచ్చరికలను పెడచెవిన పెట్టి ప్రవర్తిస్తే ప్రాణం మీదికి తెచ్చుకున్నట్లేనన్నారు. మద్యం సేవించి ఎవరు సముద్రంలో మునగరాదన్నారు.

వ్యవసాయ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

వీసీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, అధ్యాపకులు

బాపట్ల: వ్యవసాయ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు నేరుగా సేవచేసే అవకాశం వ్యవసాయ విద్యతోనే సాధ్యమని చెప్పారు. కళాశాల డీన్ డాక్టర్ మణి, వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, విశ్వవిద్యాలయం అధికారులు పాల్గొన్నారు.

వైభవం.. నాటకోత్సవం



"ది ఇంపోస్టర్ " నాటకంలోని ఓ సన్నివేశం

- సుందర దృశ్య కావ్యాలను ఆవిష్కరిస్తున్న నాటకోత్సవాలు
- పల్లెకోనలో కొనసాగుతున్న అఖిల భారత స్థాయి నాటక పోటీలు
- సామాజిక ఇతివృత్తాలే ప్రధాన అంశాలు

పల్లెకోన(భట్టిప్రోలు): సుందర దృశ్య కావ్యాలను కళావేదిక సాక్షిగా ఆవిష్కరించి మానవతా విలువలకు ప్రథమ పీట వేశారు కళాకారులు..కళాకారులు నవరసాలు పలికిస్తూ తమ హావభావాలతో ప్రతి ఒక్కరినీ అలరిస్తున్నారు. కళలను దోసిట పట్టి నేటి తరానికి అందిస్తూ కళాకారులు ప్రేక్షకుల హృదయాలపై చెరగని ముద్ర వేస్తున్నారు. సమాజాభివృద్ధికి భాగస్వాములు కావాలంటూ సందేశాలను ఇచ్చాయి. నాటకాలకు ఆదరణ తగ్గిపోతున్న నేటి దినాల్లో భట్టిప్రోలు మండలం పల్లెకోన నందమూరి తారక రామారావు కళా ప్రాంగణంలో తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి ఆడిటోరియం, పరుచూరి రఘుబాబు, టి.సుబ్బిరామిరెడ్డి లలిత కళా పరిషత్ కళా మండపంలో పరుచూరి రఘుబాబు మెమోరిల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ డి.రామానాయుడు అఖిల భారత ఆహ్వాన నాటకాలు 31వ అఖిల భారత నాటక పోటీలలో భాగంగా రెండవ రోజు సోమవారం రెండు నాటకాలు ప్రదర్శితమయ్యాయి. సినీ రచయిత, నటుడు పరుచూరి వెంకటేశ్వరరావు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ నాటక పోటీలకు విశేష స్పందన లభిస్తుంది. నాటకోత్సవాలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి కూడా కళాభిమానులు తరలివస్తున్నారు. నాటకాలు వీక్షకులకు వినోదాన్ని పంచటమే కాక ఆలోచింపజేస్తున్నాయి. ఈ నాటకోత్సవాలు 31వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నాటక పోటీలను ముగ్గురు నిష్ణాతులైన న్యాయ నిర్ణేతలు తిలకించి కళాకారుల ప్రతిభను బేరీజు వేస్తున్నారు. నాటకోత్సవ సమన్వయ కర్త డి.రామకోటేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించగా, వ్యాఖ్యాతగా డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి వీవీ రాజగోపాల్, పద్మావతి, వేజండ్ల బసవపున్నారావు, మండవ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'ది ఇంపోస్టర్ '..

మనిషి ఎంత ధనవంతుడైనా, బలవంతుడైనా, అహంకారైనా ఆత్మ సాక్షికి సమాధానం చెప్పవలసిందే. తన అధికారంతో అందరినీ తన పాదాల వద్దకు తెచ్చుకుంటాడేమో గానీ తను మాత్రం ఆత్మ సాక్షి ముందు తల వంచవలసిందే. మిత్రా క్రియేషన్స్ నరసరావుపేట వారి ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'ది ఇంపోస్టర్ ' (అంతా నిజమే చెబుతారు) నాటిక ప్రేక్షకులను అలరించింది. నాటకానికి రచన ఆకురాతి భాస్కర్ చంద్ర, దర్శకత్వం ఎస్ఎం బాషా వహించారు.

ఆలోచింపజేసిన 'సవారి'

మనిషి తనకు తెలిసి తప్పు చేస్తున్నప్పుడు ఆ తప్పు ఆ మనిషి జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది. తప్పు చేస్తూనే అది ఊళ్లు, సముద్రాలు దాటినా వెంటాడి వేటాడుతూనే ఉంటుందనేదే సవారి నాటక సారాంశం. కళాస్రవంతి ఉక్కు నగరం(విశాఖపట్నం) వారి ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'సవారి' వీక్షకులను ఆలోచింపజేసింది. ఈ నాటకానికి రచన స్నిగ్ధ, దర్శకత్వం పి.బాలాజీ నాయక్ వహించారు.

చీరాలలో పట్టపగలే చోరీ

20 సవర్ల బంగారం, నగదు అపహరణ

చీరాల: ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన గుర్తుతెలియని దుండగుడు ఇదే అదనుగా ఇంట్లోకి ప్రవేశించి బంగారం, నగదు దోచుకెళ్లిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చీరాల వైకుంఠపురంలో వేంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో నివశిస్తున్న పి.హరిబాబు బియ్యం వ్యాపారంతో పాటు క్యాటరింగ్ చేస్తుంటాడు. సోమవారం పట్టణంలోని ఓ వ్యక్తికి బియ్యం ఇచ్చేందుకు ఇంటి ప్రధాన తలుపులు వేయకుండా వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తెరచి అందులో ఉన్న 20 సవర్ల బంగారంతో పాటు రూ.6 వేల నగదు చోరీ చేసి పరారయ్యాడు. అనంతరం కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన హరిబాబు బీరువా తెరచి ఉంచడాన్ని గమనించగా బంగారం కనిపించకపోవడంతో చోరీ జరిగిందని గ్రహించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.